సాక్షి సూర్యాపేట
గురువారం । 11 । మే । 2023



భూసార పరీక్షలు చేయించుకోవాలి
రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని కేవీకే శాస్త్రవేత్త కిరణ్ సూచించారు.
- 10లో



గూగుల్ లోకల్ గైడ్‌గా..
గూగుల్ మ్యాప్‌లో వేలాది లోకేషన్ల ఎంట్రీ చేసినందుకు చిలుకూరు వాసి నాగార్జున్‌కు అరుదైన గౌరవం లభించింది.
- 10లో

గరిష్ఠం/కనిష్ఠం
42°/27°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మొగ్గయ్యగూడెంలో ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

చివ్వెంల(సూర్యాపేట): ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ కిరణ్ కుమార్ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మొగ్గయ్యగూడెంలోని ఐకేపీ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టు కోవాలని సూచించారు. తేమ శాతం 17 వచ్చేలా చూసుకోవాలన్నారు. ఎగుమతి జరిగిన రైతుల బిల్లులను త్వరగా పెట్టాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, సర్పంచ్ హముడా పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భానుపురి(సూర్యాపేట): ఇటీవల హైదరాబాద్ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌ను పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రజల్లో తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిది ఏళ్లు అయినా ఉద్యోగాలను భర్తీ చేయలేదని, కనీసం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. యూనివర్సిటీలో సరైన సదుపాయాలు కల్పించకుండా నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇవ్వడం విద్యను ప్రైవేటీకరణ చేయడమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు నెలకు రూ.25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్ అందిస్తుందని తెలిపారు. దీంతోపాటు డిక్లరేషన్ లో పొందుపరిచిన ప్రతి అంశాన్ని తప్పకుండా అమలు చేస్తుందని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం పార్టీ శ్రేణులకు ఉందని గుర్తు చేశారు.

సాధారణ కాన్పులు పెంచాలి



తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌ఓ కోటా చలం సూచించారు. బుధవారం తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 22 వారాల గర్భిణుల్లో లోపాలను టీఫాస్ స్కానింగ్ ద్వారా గుర్తించనున్నట్లు తెలిపారు. ఈ సేవలు ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. గర్భిణులు, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారిణి మల్లెల వందన, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, వైద్య సిబ్బంది నర్సింహారెడ్డి, రమాదేవి ఉన్నారు.

'దళితబంధు'లో అవినీతికి పాల్పడిన వారిని శిక్షించాలి

దురాజ్‌పల్లి(సూర్యాపేట): దళితబంధు పథకం యూనిట్ల పంపిణీలో అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దళితుల జీవితాల్లో మార్పు కోసం దళిత బంధు పథకం ప్రవేశపెడితే వారికి రూ.10 లక్షలు ఇవ్వకుండా కొంతమంది ప్రజాప్రతినిధులు కమీషన్ల పేరుతో అవినీతికి పాల్పడుతున్నారని సాక్షాత్తు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని, కానీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అలాంటి ప్రజా ప్రతినిధులు, మధ్యవర్తులను గుర్తించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి యాతాకుల రాజన్న, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు, ఎంఎస్‌పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపూరి రాజు, నాయకులు, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాస్త మెరుగు

పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో 17 నుంచి 15వ స్థానానికి పెరుగుదల

- జిల్లాలో 89.93శాతం మంది పాస్
- బాలికలు 91.14శాతం మంది, బాలురు 88.80శాతం..
- 134 మంది విద్యార్థులకు 10జీపీఏ



తల్లిదండ్రులతో తొడుసు నర్సింహారావు (10/10), గడ్డిపల్లి మోడల్‌స్కూల్, గరిడేపల్లి మండలం

సూర్యాపేట టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో అమ్మాయిలే పై చేయి సాధించారు. జిల్లాలో మొత్తం 349 పాఠశాలల నుంచి 12190 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 10,963 మంది విద్యార్థులు పాసై 89.93శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. 6,278 మంది బాలురు పరీక్షలు రాయగా 5,575 మంది పాస్ కాగా 88.80శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 5,912 మంది పరీక్షలు రాయగా 5,388 మంది పాసై 91.14శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

సత్తా చాటిన గురుకులాలు, సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు

పదో తరగతి ఫలితాల్లో గురుకులాలు, సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలో నాలుగు ఎయిడెడ్ పాఠశాలల్లో 154 మంది పరీక్షలు రాయగా 132 మంది పాసై 85.71శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండు ఆశ్రమ పాఠశాలల్లో 72 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 49 మంది పాసై 68.06శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఎనిమిది బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 607 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 584 మంది పాస్ కాగా 96.21 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. అలాగే రెండు పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో 323 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 244 మంది పాస్ కాగా 75.54శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 18 కేజీబీవీల్లో 601 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 477 మంది పాసై 79.37శాతం ఉత్తీర్ణత సాధించారు. తొమ్మిది మోడల్ స్కూళ్లలో 798 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 691 మంది పాసై 86.59శాతం ఉత్తీర్ణత సాధించారు. 116 ప్రైవేట్ పాఠశాలల్లో 4520 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4,423 మంది పాసై 97.85శాతంమంది ఉత్తీర్ణులయ్యారు. 67 పాఠశాలల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒక రెసిడెన్షియల్ పాఠశాలలో 75 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 75మంది పాసై 100శాతం ఉత్తీర్ణత సాధించారు. నాలుగు మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో 242 మంది విద్యార్థులకు గాను 238 మంది పాసై 98.35శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎనిమిది సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 619 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 594 మంది పాసై 95.96మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. రెండు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 177మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 168 మంది విద్యార్థులు పాసై 94.92శాతం ఉత్తీర్ణత సాధించారు. 170 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 4,002 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,288 మంది విద్యార్థులు పాసై 82.16 శాతం ఉత్తీర్ణత సాధించారు.

10,963 మంది విద్యార్థుల ఉత్తీర్ణత

జిల్లాలో మొత్తం 349 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 12,190 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 10,963 మంది ఉత్తీర్ణత సాధించారు. 89.93 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో 99 పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత సాధించాయి. 134 మంది విద్యార్థులకు 10జీపీఏ సాధించారు.



జగదీశ్(10/10)



శీత అరవింద్(10/10)

బీసీ గురుకులం, నేరేడుచర్ల

గత ఏడాది కంటే పెరిగిన స్థానం

గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 93శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా 17వ స్థానంలో నిలిచింది. కాగా ఈ ఏడాది 89.93శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. గత ఏడాది కంటే 3శాతం ఉత్తీర్ణత తగ్గింది. రాష్ట్రంలో జిల్లా స్థానం గత ఏడాది 17వ స్థానం కాగా ఈ ఏడాది 15వ స్థానం దక్కించుకుంది.



గుండాల సాయిరాం (10/10), బీసీ బాలుర గురుకులం, నాగారం మండలం



శ్రీజ (10/10), ఇమాంపేట మోడల్‌స్కూల్, సూర్యాపేట మండలం

తొలి రోజు 1,198 మంది హాజరు



అనంతగిరిలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న విద్యార్థులు

- నాలుగు కేంద్రాల్లో ఎంసెట్ ప్రారంభం
- 62 మంది గైర్హాజరు

సూర్యాపేట టౌన్, కోదాడ అర్బన్, అనంతగిరి: జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఎంసెట్ బుధవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. మొదటి రోజు మెడికల్, అగ్రికల్చర్ పరీక్ష నిర్వహించారు. షిఫ్ట్–1 ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, షిఫ్ట్–2 మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగింది. రెండు షిఫ్టుల్లో మొత్తం 1260 మంది విద్యార్థులకు గాను 1198 మంది హాజరుకాగా 62 మంది గైర్హాజరయ్యాయి. సూర్యాపేట పట్టణంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో షిఫ్ట్–1లో 215 మంది విద్యార్థులకు 200 మంది హాజరు కాగా 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. షిఫ్ట్–2లో 215 మంది విద్యార్థులకు 204 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కోదాడ పట్టణంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో షిఫ్ట్–1లో 104 మంది విద్యార్థులకు 98 మంది హాజరయ్యారు. షిఫ్ట్–2లో 104 మందికి 99 మంది హాజరైనట్లు సూపరింటెండెంట్ తెలిపారు. సన ఇంజనీరింగ్ కళాశాలలో షిఫ్ట్–1లో 104 మందికి 98 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్ర సూపరింటెండెంట్ పి. గాంధీ తెలిపారు. షిఫ్ట్–2లో 104 మందికి 102 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. అనంతగిరి మండల కేంద్రంలోని అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీలో షిఫ్ట్–1లో 207 మంది విద్యార్థులకు 198 మంది హాజరయ్యారు. షిఫ్ట్–2లో 207 మంది విద్యార్థులకు 199 మంది హాజరయ్యారు.

ధాన్యం రవాణాను వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకట్రావు



జగన్నాథ రైస్‌మిల్లును పరిశీలిస్తున్న కలెక్టర్

చివ్వెంల(సూర్యాపేట) : ధాన్యం రవాణాను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. చివ్వెంల మండల పరిధిలోని వల్లభాపురంలో వన నర్సరీ, గ్రామ శివారులోని జగన్నాథ రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. వనర్సరీ నిర్వహణ పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం దిగుమతిని పరిశీలించారు. ధాన్యం దిగుమతుల్లో ఇబ్బందులు తలెత్తకుండా హమాలీల సంఖ్యను పెంచాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకం పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. హరితహారంలో భాగంగా మొక్కల సంరక్షణపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ లక్ష్మి, తహసీల్దార్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రసవత్తరంగా రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పపంచ గవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్చరణాలతో వైభవంగా కల్యాణతంతు ముగించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజ చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు చేరుకున్న ఐశ్వర్య మృతదేహం



ఐశ్వర్య మృతదేహం

నేరేడుచర్ల : అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం అలెన్ పట్టణంలోని సూపర్ మార్కెట్ వద్ద శనివారం జరిగిన దుండగుడి కాల్పుల్లో ఐశ్వర్య మృతిచెందగా.. ఆమె మృతదేహం బుధవారం రాత్రి 10 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. మృతదేహాన్ని విమానాశ్రయం నుంచి కొత్తపేటలోని ఓమిని ఆస్పత్రికి తీసుకువచ్చి భద్రపరిచారు. గురువారం ఉదయం 6 గంటలకు ఐశ్వర్య మృతదేహాన్ని కొత్తపేట హుడాకాంప్లెక్స్‌లోని స్వగృహానికి తరలిస్తారు. ఆ తర్వాత 9 గంటలకు నాగోలులోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

సూర్యాపేట రూరల్: గ్రామాల్లో పల్లె ప్రగతిలో పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష ఆదేశించారు. బుధవారం మండలంలోని కాసరబాద గ్రామంలో పల్లె ప్రగతిలో చేసిన పలు అభివృద్ధి పనులను పరిశీలించి మాట్లాడారు. మన ఊరు–మనబడిలో భాగంగా పాఠశాలల్లో మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రం, రేషన్ దుకాణం, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు బంటు సైదులు, కొల్లు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

అర్వపల్లి: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని డీఏఓ రామారావునాయక్ కోరారు. బుధవారం అర్వపల్లిలోని సెర్ప్‌ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేసి బస్తాలను మిల్లులకు ఎగుమతి చేయాలన్నారు. అలాగే అర్వపల్లి పీహెచ్‌సీ, పర్సాయపల్లి అంగన్‌వాడీ, పల్లెప్రకృతివనం, వననర్సరీలను పరిశీలించారు. పీహెచ్‌సీలో సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ పి. యాదగిరిరెడ్డి, ఎంపీఓ ఉపేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి మాగి నాగయ్య, స్టాఫ్ నర్స్ రమాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది సెర్ప్ కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

బీజేపీ కో హటావో- దేశ్‌కో బచావో



జెర్రిపోతులగూడెంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్, నారాయణరావు

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్

చిలుకూరు: బీజేపీ కో హటావో- దేశ్‌కో బచావో నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమం చేపట్టినట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని జెర్రిపోతులగూడెంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. మొదటి రోజు జెర్రిపోతులగూడెం గ్రామంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం, బేతవోలు మీదుగా కొనసాగి పోలేనిగూడెంలో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ మతతత్వ విధానాలతో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపిందని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా, మండల నాయకులు కొండా కోటయ్య, రెమిడాల రాజు, కృష్ణారెడ్డి, తాళ్లూరి వెంకటయ్య, తాళ్లూరి మల్లయ్య, సాహెబ్ అలీ, అనంతుల రాము, పెద్ద మల్లయ్య, రెమిడాల జయసుధ, అలివేలు, కాంపాంటి వెంకటయ్య, చిలువేరు అంజనేయులు, పోరెండ్ల మట్లయ్య, గురవయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

16 మంది విధులకు హాజరు



సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద బతుకమ్మలు పేర్చుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- కొనసాగుతున్న జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె
- 13వ రోజు బతుకమ్మలతో నిరసన
- ప్రభుత్వ హెచ్చరికను లెక్క చేయని కార్యదర్శులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జూనియర్ , అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సాయంత్రం నాటికి సమ్మెను విరమించి విధుల్లో చేరాలని ప్రభుత్వం అల్టిమేటం జారీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కేవలం 16 మంది కార్యదర్శులు మాత్రమే విధుల్లో చేరారు. వీరిలో 10 మంది అవుట్ సోర్సింగ్, ఆరుగురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

336 జేపీఎస్‌లు, 52 మంది ఓపీఎస్‌లు

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 336 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, 52 మంది అవుట్ సోర్సింగ్ కార్యదర్శులు ఇలా మొత్తం 388 మంది ఉన్నారు. ఇందులో 9 మంది జేపీఎస్‌లు, ఇద్దరు ఓపీఎస్‌లు సెలవుల్లో ఉండగా 377 మంది సమ్మెకు దిగారు. అయితే వీరిలో 11మంది జేపీఎస్‌లు, 10 మంది ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు మొత్తం 21 మంది విధుల్లో చేరుతామని మంగళవారం లెటర్లు ఇచ్చారు. బుధవారం ప్రమాతం వీరిలో ఐదుగురు తిరిగి సమ్మెలోకి వెళ్లారు. 16 మంది విధుల్లోఉన్నారు. ప్రస్తుతం 361 మంది సమ్మెలో ఉన్నారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేసే వరకు విధుల్లో చేరేది లేదని వారు స్పష్టం చేశారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెలో భాగంగా 13వ రోజు బుధవారం కలెక్టరేట్ ఎదుట బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మహిళా పంచాయతీ కార్యదర్శులు ఆవుల ఆకాంక్ష, సారిక, స్రవంతి, గ్రీష్మ, రమణ, రజిత, కవిత, అక్షిత, సౌమ్య పాల్గొన్నారు.

వేసవి క్రీడోత్సవం

- సీఎం కప్–2023కి ఏర్పాట్లు
- 15వ తేదీ నుంచి 31 వరకు క్రీడాపోటీలు
- మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహణ
- వివరాల నమోదుకు 14వరకు గడువు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

నాగారం: సుదీర్ఘ విరామం తర్వాత వేసవిలో సీఎం కప్ –2023 పేరిట నిర్వహించనున్న ఆటల పోటీలతో మైదానాలు సందడిగా మారనున్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రీడా సంబరాలు నిర్వహించనున్నారు. ఈనెల 15 నుంచి 31 వరకు వివిధ అంశాల్లో క్రీడా పోటీలు జరగనున్నాయి. దీనిపై రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఇప్పటికే కసరత్తు చేసింది. 15 నుంచి 36 ఏళ్ల మహిళలు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించే ఆటలు, వాటి నిర్వహణకు కమిటీలు, అందులో ఎవరెవరూ ఉండాలనే అంశాలను పేర్కొంటూ సంస్థ మార్గదర్శకాలను విడుదల చేసింది. క్రీడల నిర్వహణ కోసం మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. మండల స్థాయిలో ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీఓ కన్వీనర్‌గా, జెడ్పీటీసీ సభ్యుడు, తహసీల్దార్, మండల విద్యాధికారి, పురపాలిక కమిషనర్, ఎస్‌ఐ, వ్యాయామ ఉపాధ్యాయులు కమిటీ సభ్యులుగా వ్యవహరించనున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

క్రీడాంశాలివే..

ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లాస్థాయిలో, 28 నుంచి 31 వరకు రాష్ట్రస్థాయిలో క్రీడలు నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయిలో పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, హాకీ, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాట్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, షూటింగ్ తదితర క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయి. జిల్లా స్థాయిలో పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాట్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ ఇలా 11 క్రీడాంశాల్లో పోటీలు ఏర్పాటు చేస్తారు. మండల స్థాయిలో ఈనెల15 నుంచి 17 వరకు పురుషులకు ఫుట్‌బాట్, పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తారు. మండల స్థాయిలో విజేతలకు జిల్లాస్థాయి పోటీలకు, అందులో ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

రాష్ట్రస్థాయి విజేతలకు నగదు పారితోషికాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలకు నగదు పారితోషికాలు అందిస్తారు. వ్యక్తిగత క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు రూ.20వేలు, ద్వితీయ రూ.15వేలు, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ.10వేల చొప్పున బహుమతులు అందజేస్తారు. గ్రూప్ క్రీడల్లో ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ రూ.75వేలు, తృతీయ రూ.50వేల చొప్పున నగదు అందించనున్నారు. మండల స్థాయిలో క్రీడల నిర్వహణకు రూ.15వేలు, జిల్లాస్థాయిలో క్రీడల నిర్వహణకు రూ.75వేలు మంజూరు చేస్తారు.

పకడ్బందీగా పోటీలు నిర్వహిస్తాం



సీఎం కప్–2023 క్రీడల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా మండల, జిల్లాస్థాయిలో క్రీడలు నిర్వహిస్తాం. 15 నుంచి 36 ఏళ్లు ఉన్నవారు పోటీల్లో పాల్గొనాలి. మండల, జిల్లాస్థాయిలో నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల14లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలి.

– బి.వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి, సూర్యాపేట

క్లుప్తంగా

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్

మోతె : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రా ప్రాంతం నుంచి లారీలో ఇసుకను తరలిస్తుండగా మండల పరిధిలో సింగరేనిపల్లె టోల్‌గేట్ వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడింది. లారీని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం లారీ యజమాని ధరావత్ సురేష్, డ్రైవర్ గుగులోతు రజినీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి : గుర్తుతెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం పట్టణంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట–సికింద్రాబాద్ రైల్వే మార్గంలోని భువనగిరి రైల్వే స్టేషన్‌కు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి సాయంత్రం 5గంటల ప్రాంతంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి దుస్తులపై కలర్ వేసే వ్యక్తిగా ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



పెద్దకాపర్తి శివారులో హైవే పక్కన బోల్తా పడిన బొలేరో

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎన్.ధర్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్తున్న బొలేరో గూడ్స్ వాహనాన్ని డ్రైవర్ అతివేగంగా ఆజాగ్రత్తగా నడపడంతో పెద్దకాపర్తి శివారులోని హోటల్–7 సమీపంలోకి రాగానే అదుపుతప్పి హైవే పక్కన బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ కొండేటి నాగయ్యతో పాటు క్లీనర్ ఆడేపు హరిప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



అధికారులకు సూచనలు చేస్తున్న డీఆర్‌డీఓ కాళిందిని

కేతేపల్లి : ఉపాధిహామీ పథకంలో గ్రామాల్లో పనులు గుర్తించి కూలీలకు పనులు కల్పించాలని డీఆర్‌డీఓ కాళిందిని అధికారులను ఆదేశించారు. బుధవారం ఉపాధిహామీ పథకం నిర్వహణపై కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కేతేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె హాజరయ్యారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పల్లె ప్రకృతి వనాలతో పాటు, నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీడీ శైలజ, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాల్, ఏపీఓ సురేందర్ తదితరులు ఉన్నారు.

‘పది’లో మెరిసిన పేదింటి బిడ్డలు

- ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ జీపీఏలు
- ఇదే పట్టుదలతో ఉన్నత విద్యను కొనసాగిస్తామని వెల్లడి
- అందరి మన్ననలు పొందుతున్న సాయికుమార్, సిరిచందన



సాయికుమార్‌ను అభినందిస్తున్న తల్లి శారద



సిరిచందనకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ జీపీఏ సాధించి అందరి మన్ననలు పొందుతున్నారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులను ఇదే తరహాలో అభ్యసించి తామెంటో నిరూపించుకుంటామని చెబుతున్నారు.

తల్లి రెక్కల కష్టంతో చదివి 10జీపీఏ..

తిరుమలగిరి మండలం ఎర్రచెరువు తండాకు చెందిన రమావత్ సర్దార్, శారద దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు. అందులో చిన్న కుమారుడైన సాయికుమార్ పెద్దవూర మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివాడు. సాయికుమార్ ప్రతిభను గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయులు మొదటి నుంచి ప్రోత్సహిస్తూ వచ్చారు. దీంతో బుధవారం విడుదలైన ఫలితాల్లో సాయికుమార్ 10జీపీఏ సాధించాడు. తన తల్లి పెద్దవూరలో చిన్నపాటి పని చేసుకుంటూ పిల్లలను పోషిస్తుంది. సాయి కుమార్ తండ్రి సర్ధార్ నాయక్ కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి చనిపోయినా తల్లి రెక్కల కష్టంతో తనను చదివిస్తుందని ఆమె కష్టానికి ఫలితం తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నానని.. సాయికుమార్ చెబుతున్నాడు. భవిష్యత్‌లో ఉన్నత విద్యను అభ్యసించి కుటుంబ సమస్యలు తీరుస్తానని పేర్కొంటున్నాడు.

9.8 జీపీఏతో మండల టాపర్‌గా..

రాజాపేట : జనగామ జిల్లా కేంద్రానికి చెందిన మచ్చ రమేష్ రజినీ దంపతులకు ఇద్దరుకుమార్తెలు. పెద్ద కుమార్తె మచ్చ సిరిచందన రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామంలో తన అమ్మమ్మ గంజి లక్ష్మి ఇంట్లో ఉంటూ స్థానిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. సిరిచందన బుధవారం వెలువడిన పదవతరగతి పరీక్ష ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. తల్లిదండ్రులది పేద కుటుంబం.పవర్ లూమ్స్‌పై ఆధారపడి జీవనోపాధి పొందుతూ ఇద్దరు కుమార్తెలను చదివిస్తున్నారు. కాగా సిరిచందన ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకు మండల విద్యాధికారి కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

పదో తరగతి ఫలితాల్లో ‘జయ’ కేతనం

- 47 మంది విద్యార్థులకు 10జీపీఏ



10జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జయ పాఠశాల యాజమాన్యం

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని జయ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. పాఠశాలలో మొత్తం 283 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 47మంది విద్యార్థులకు 10/10జీపీఏ సాధించి సత్తా చాటారు. 41మంది విద్యార్థులు 9.8జీపీఏ, 27 మంది విద్యార్థులు 9.7జీపీఏ, 31మంది 9.5జీపీఏతో పాటు 217మంది విద్యార్థులు 9కంటే ఎక్కువగా జీపీఏ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

10జీపీఏ సాధించిన విద్యార్థులు వీరే..

ఎ.జయశ్రీ, బి.భవ్యశ్రీ, బి.శ్రీమాన్విత, బి.రిషిక, సీహెచ్.హర్షితశ్రీ, డి.సాయిశ్రీ, డి.సహస్ర, డి.హసిత, జి.మౌనిక, జి.తేజశ్రీ, జి.రక్షిత, జె.అక్షిత, జె.కీర్తన, కె.ప్రజ్ఞశ్రీ, కె.దివ్యశ్రీ, కె.చార్మిక, కె.కీర్తి, ఎల్.భువన, ఎం.స్ఫూర్తి, పి.నందిని, పి.రిషిక, ఎస్.నక్షత్ర, టి.హర్షిత, వై.లహరి, ఎ.హీరానంద్, బి.రాజ్‌కుమార్, విష్ణువర్ధన్, డి.బాలరోహిత్, డి.వరుణ్‌తేజ్, బి.అచ్యుత్, బి.నవనీత్, సీహెచ్.విఖ్యాత్ రెడ్డి, వి.దర్శిల్‌నందన్‌రెడ్డి, జి.మణిదీప్, జి.సాయిచరణ్‌రెడ్డి, జి.నిఖిల్, జి.వరుణ్, కె.శశివదన్, ఎ.ఉజ్వన్, ఎం.శ్రీచరణ్, ఎం.శ్రీసాయిబ్రహ్మం, ఎం.యశ్వంత్‌గుప్త, ఎస్.ఇషాంత్, సాయినైతిక్‌తేజ, పి.అమిత్‌సూర్య, చైతన్యశర్మ, వై.సాయిచరణ్ తదితర విద్యార్థులు 10జీపీఏ సాధించారు.

దేవరకొండ మండలంలో చిరుత సంచారం ?

- అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన బీట్ ఆఫీసర్లు



గొల్లపల్లి అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బీట్ ఆఫీసర్లు

దేవరకొండ : దేవరకొండ మండలంలో చిరుత సంచారం కలకలం రేపుతోంది. మంగళవారం సాయంత్రం దేవరకొండ మండలం తాటికోల్ గ్రామపంచాయతీ పరిధి గొల్లపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద కూలీలు పల్లీ తీసేందుకు వెళ్లారు. అయితే, అక్కడ ఉన్న వరికోత మిషన్‌డ్రైవర్ చిరుత ఆకారంతో ఉన్న జంతువు అటవీ ప్రాంతంలోకి వెళ్లడాన్ని చూసి కూలీలకు తెలిపాడు. దీంతో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న రైతులు తమ పశువులను ఇళ్లకు తోలుకెళ్లారు. కాగా, గొల్లపల్లిలో చిరుత సంచరిస్తుందన్న సమాచారం అందుకున్న నల్లగొండ రేంజ్ అటవీ శాఖ బీట్ ఆఫీసర్లు రవీందర్, శేఖర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని చిరుత సంచరించిందన్న ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించారు. అనంతరం గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. ఇదిలా ఉంటే చిరుత సంచరించింది అనడానికి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని బీట్ ఆఫీసర్లు పేర్కొన్నారు. చిరుత సంచారం వార్త కలకలం రేపడంతో గొల్లపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు.

మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

చిట్యాల : జిల్లాలోని రైస్‌మిల్లర్స్ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని డీఎస్‌ఓ వి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. చిట్యాలలో బుధవారం ఆయన రైస్‌మిల్లర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 52,362 మంది రైతుల నుండి 3,84,913 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ ఆర్‌ఐ లింగస్వామి, రైస్‌మిల్లర్స్ అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతు, పందిరి శ్రీనివాసులు, వేలుపల్లి వెంకటేశ్వర్లు, పోలా పెద్దయ్య, వేలుపల్లి శంకరయ్య ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న ఏనుబాముల గ్రామ రైతులు

ఆత్మకూర్ (ఎస్): షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల పరిధిలోని సూర్యాపేట–దంతాలపల్లి రహదారిపై ఏనుబాముల గ్రామానికి చెందిన రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం తడిచిపోయాయన్న సాకుతో మిల్లుకు పోయిన ధాన్యంలో కోతలు పెడుతున్నారని, తాలు, మొలకలు ఉన్నాయని చెప్పి కొనుగోళ్లు జరపకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

- పోలీస్ సిబ్బందికి నల్లగొండ ఎస్పీ అపూర్వరావు ఆదేశం

హాలియా, త్రిపురారం : పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని నల్లగొండ ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. బుధవారం హాలియా, త్రిపురారం పోలీస్‌స్టేషన్లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పనితీరు గురించి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అధికారులు సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం రేట్‌ను మరింత తగ్గించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా పనిచేయాలన్నారు. వేసవికాలంలో ఎక్కువగా దొంగతనాలు జరిగే అవకాశాలు ఉంటాయని దొంగతనాలు జరగకుండా పగలు, రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీలో భాగంగా ప్రతి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు వ్యాపార సముదాయాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, సీఐ గాంధీనాయక్ ఉన్నారు.

పశువుల కాపరి అదృశ్యం

నిడమనూరు : పశువుల కాపరి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన నిడమనూరు మండల పరిధిలో ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుగొమ్ము మండలం కాసరాజు పల్లెకు చెందిన వాంకుడోతు కృష్ణానాయక్ అలియాస్ బూరి పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. కాసరాజు పల్లెకు చెందిన వాంగుడోతు బాలునాయక్ 15రోజుల క్రితం పశువులను మేపేందుకు నిడమనూరు మండలానికి వచ్చాడు. పశువులను రాయడానికి బంధువు, అదే గ్రామానికి చెందిన కృష్ణానాయక్‌ను వెంట తీసుకొచ్చాడు. వచ్చిన మరునాడే కృష్ణానాయక్ పశువులను కాస్తూనే కనిపించకుండా పోయాడు. బాలునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

వివాహిత అదృశ్యం



నవ్య

హుజూర్‌నగర్: వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్‌లోని దద్దనాల చెరువు కాలనీకి చెందిన చిప్పల వెంకటరాజుకు మఠంపల్లి మండలానికి చెందిన నవ్యతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వెంకటరాజు సుతారి పని చేస్తుండేవాడు. వీరికి సంతానం లేదు. నవ్యను భర్త తాగివచ్చి తరచూ వేధిస్తుండేవాడు. భర్త వేధింపులు పడలేక అతను సుతారి పనికి వెళ్లిన తర్వాత ఆమె ఇంటికి తాళం వేసి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో నవ్య తల్లి వల్లభనేని శివదేవి ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

హుజూర్‌నగర్: బెల్లం, సారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతలపాలెం మండలంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు బుధవారం వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో యర్రకుంటతండాకు చెందిన భూక్యా సర్దార్ బైక్‌పై తరలిస్తున్న 50 కేజీల బెల్లం, 5 లీటర్ల సారాతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నా రు. సర్దార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. దా డుల్లో సీఐ భరత్‌భూషణ్, ఎస్‌ఐ శివకృష్ణ జిబ్బంద నాగరాజు, రాము, రవి, బ్రహ్మం, రమేష్ పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

ధాన్యం డబ్బులు పోగొట్టుకున్న రైతు

- మోపెడ్‌పై వస్తుండగా జారిపడిపోయిన రూ.లక్షా 20వేలు



బాధితుడు రాములు

సంస్థాన్ నారాయణపురం : ఓ రైతు ఆరుగాల కష్టం మరొకరి పాలైంది. ధాన్యం విక్రయించిన డబ్బులను బ్యాంకు నుంచి డ్రా చేసుకుని మోపెడ్‌పై ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయాయి. ఈ ఘటన సంస్థాన్‌నారాయణపురంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంస్థాన్‌నారాయణపురానికి చెందిన పులగోని రాములు కొనుగోలు కేంద్రంలో ఇటీవల ధాన్యం విక్రయించాడు. ధాన్యం డబ్బులు రూ.1.2 లక్షలు ఏపీజీవీ బ్యాంకులో జమయ్యాయి. వాటిని డ్రాచేసుకొని టీవీఎస్ మోపెడ్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో కవర్ కింది భాగంలో నుంచి పాస్‌పుస్తకాలు, డబ్బులు జారిపడ్డాయి. కాములు ఇంటికి వెళ్లి చూడగా డబ్బులు లేకపోవడంతో దారి పొడవునా వెతికాడు. అయితే, పాస్‌పుస్తకాలు దొరికినప్పటికీ డబ్బులు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీస్‌సేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎవరికైనా దొరికితే అప్పగించాలని కోరాడు.

షార్ట్‌సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధం

- రూ.3లక్షల నగదుతోపాటు రూ.10లక్షలకు పైగా ఆస్తినష్టం
- అగ్ని ప్రమాదంతో వీధినపడిన కుటుంబం



అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిబూడిదైన సామగ్రి

శాలిగౌరారం: షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని మాధారంకలాన్‌లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాషబోయిన మారయ్య చేపల వృత్తిదారుడు. రోజూ వారీగా మంగళవారం సాయంత్రం వరకు గ్రామంలోని రామనీల సముద్రం చెరువులో చేపల వేటకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయాడు. మారయ్య భార్య, వృద్ధురాలైన తల్లి, మనుమరాలు కలిసి ఇంటిముందు వరండాలో నిద్రపోయారు. ఒక గదిలో మారయ్య నిద్రిస్తుండగా అనుకోకుండా మరోగదిలో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు లేచాయి. చూస్తుండగానే మంటలు గది మొత్తం వ్యాపించాయి. ప్రమాదంలో విలువైన సామగ్రి, పత్రాలు రూ.3లక్షల నగదు దాచిన ఇనుపపెట్టి కాలిబూడిదయ్యాయి. దీంతో మారయ్య నిద్రిస్తున్న గదిలో పొగ కమ్ముకుంది. గాఢనిద్రలో ఉన్న మారయ్య ఊపిరాడక గట్టిగా కేకలు వేయడంతో ఇంటిబయట నిద్రిస్తున్న అతడి భార్య, తల్లి లేచి లబోదిబోమనడంతో చుట్టుపక్కలవారు వచ్చి మారయ్యను బయటికి తీసుకువచ్చారు. నిమిషాల వ్యవధిలోనే మంటలు రెండవ గదికి కూడా వ్యాపించి అందులోని సామగ్రి కూడా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాదంతో మారయ్య కుటుంబం రోడ్డునపడింది. సంఘటనా స్థలాన్ని స్థానిక సర్పంచ్ జేరిపోతుల మంజులచంద్రమౌళి, ఎంపీటీసీ నోముల జనార్దన్ బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

పునరావాస చర్యలు వేగవంతం చేయాలి

- నల్లగొండ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : జిల్లాలో చేపట్టిన నీటి పారుదల ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు సంబంధించి భూసేకరణ, నష్ట పరిహారం చెల్లింపు, ఆర్‌అండ్‌ఆర్ కింద పునరావాస చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డిండి ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన రిజర్వాయర్‌ల భూ నిర్వాసితులు, ఏఎమ్మార్పీకి సంబంధించి భూసేకరణ, నిర్వాసితులకు చెల్లింపు, పునరావాస చర్యల ప్రగతిపై అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. కృష్ణరాయినిపల్లి రిజర్వాయర్ కింద ముంపునకు గురయ్యే నాంపల్లి మండలం లక్ష్మణాపురం, చింతపల్లి మండలం ఈదులగండి గ్రామాల నిర్వాసితులకు చింతపల్లిలో భూ కేటాయించాలన్నారు. అయిటిపాముల కెనాల్ పనులకు మార్కింగ్ పూర్తిచేసి పనులు మొదలు పెట్టినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రోహిత్‌సింగ్, దేవరకొండ ఆర్డీఓ గోపిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు భూములు గుర్తించాలి

హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించి సిద్ధంగా ఉండాలని, ఇరిగేషన్ భూములు గుర్తించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హరితహారం, పల్లె ప్రగతి, ఈజీఎస్, మొక్కల పెంపకం తదితర అంశాలపై సమీక్షించారు. అధికారులంతా సంయుక్తంగా సర్వే చేసి మొక్కలు నాటేందుకు భూముల వివరాలను అందించాలన్నారు. ఉపాధి హామీ పనుల లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేలా ముందుకు సాగాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ విష్ణువర్ధన్, జిల్లా ఇరిగేషన్ అధికారి ప్రభు కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

చెరువు మట్టితో చేనుకు పుష్టి

- రసాయన ఎరువుల్లో ఉండే పోషకాలు లభ్యం
- అధిక దిగుబడులకు ఆస్కారం



చెరువు మట్టిని పొలంలో వేసుకున్న రైతు

పాడి పంట

పెద్దవూర: పంట భూముల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండటం, వర్షపునీటిని నిలుపుకునే సామర్థ్యం తగ్గుతుండటంతో రైతులకు సరైన దిగుబడులు రావడం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించటం వలన భూసారం తగ్గిపోతుంది. అందుకే రైతులు చెరువు మట్టిని విరివిగా వాడుకోవాలసిన అవసరం ఉంది. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో చెరువుల్లో నీరు అడుగంటిపోయి ఉంటుంది. ఆయా చెరువుల్లోని మట్టిని పంట భూముల్లో వేసుకుంటే రసాయన ఎరువులపై పెట్టే ఖర్చును వీలైనంతగా తగ్గించుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి సందీప్ సూచిస్తున్నారు.

రెండు రకాలుగా..

గతంలో వేసవికాలంలో నీరు ఎండిపోయినప్పుడు చెరువుల నుంచి మట్టిని తీసి పంట పొలాల్లో వేసుకునేవారు. ఇప్పుడు ఈ పద్ధతి పాటించే వారు తక్కువయ్యారు. కానీ దీనివలన రెండు రకాల ప్రయోజనాలు కలుగుతాయి. వర్షాలు పడ్డప్పుడు ఈ నీటితో కలిసి పోషక విలువలు కలిగిన సారవంతమైన మట్టి మొత్తం వచ్చి చెరువులోకి చేరుతుంది. ఈ మట్టితో చెరువు నిండుతుంది. వేసవిలో నీళ్లు తక్కువగా ఉండటం వలన ఈ మట్టిని పూడిక తీయడం వలన మళ్లీ వచ్చే ఏడాది చెరవులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ఎక్కువ నీళ్లు నిలిచే అవకాశం ఉంటుంది. తద్వారా నీటి లభ్యత పెరుగుతుంది. ఇక చెరువు నుంచి తీసిన మట్టిని పంట పొలాల్లో వేయడం ద్వారా ఆ పొలాలు సారవంతం అవుతాయి. చెరువు మట్టిలో ఉండే ఆల్గే వల్ల నత్రజని ఎక్కువగా అందుతుంది. దిగుబడి పెరుగుతుంది.

ఒండ్రు, బంకమట్టి ఎంతో మేలు

వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తైన ప్రదేశాల నుంచి వర్షపు నీటితో పాటు ఇసుక, బంకమట్టి, ఒండ్రుమట్టి, వివిధ పాళ్లలో కుళ్లిన వ్యర్థాలతో కలిసి చెరువుల్లోకి చేరుతాయి. అందులో నీరు ఉన్నంతకాలం లోపలే కుళ్లి మంచి సేంద్రియ కర్బనంగా మారుతుంది. సాధారణంగా చెరువు మట్టిలో 70శాతం ఒండ్రు, 30 శాతం బంకమట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. చెరువు మట్టి వలన పంట భూమిలో నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు. అంతేకాదు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు ఆస్కారం ఉంటుంది.

ప్రయోజనాలు ఇలా..

- చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా పొలాన్ని ఆమ్ల, క్షార గుణాలతో తటస్థంగా మార్చుకోవచ్చు.
- నేల గుల్లబారుతుంది. మురుగు నీటి పారుదల మెరుగవుతుంది.
- సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయిలు పెరుగుతుంది. ముఖ్యంగా నత్రజని స్థాయిలు పెరుగుతాయి.
- మట్టితో పాటు సేంద్రియ ఎరువులను కూడా కలిపి పొలంలో వేసుకోవడం ద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు.
- ఈ మట్టిలో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉంటాయి. ఇవి నేలలో గాలి పరిమాణాన్ని పోషకాలను పెంచుతాయి.
- అన్ని రకాల పోషకాలను అందిస్తూ దీర్ఘలికాలికంగా పంట పొలం ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది.
- దిగుబడి కూడా ప్రతి పంటలోనూ ఎకరానికి ఏడు నుంచి పది క్వింటాళ్ల మేర పెరుగుతుంది.

చెరువు మట్టి సేకరణకు చేయించాల్సిన పరీక్షలు

- చెరువు మట్టి పూడిక స్థాయి, లోతు, విస్తీర్ణం గమనించాలి. దాన్ని తీయడం వలన చెరువుకు ఉపయోగం ఉందా లేదా అని గమనించాలి.
- చెరువు మట్టిలోని పోషకాల స్థాయిని గుర్తించేందుకు మట్టి పరీక్షలు చేయించాలి.
- ఈ పరీక్షల్లోనే ఆ మట్టిలోని రసాయన అవశేషాల స్థాయిని కూడా తెలుసుకోవాలి.

సాగుకు అనుకూలం

గ్రామాల్లో వర్షాధార చెరువులు ప్రస్తుతం అడుగంటిపోతున్నాయి. ఎండిన చెరువుల్లోని 2 నుంచి 3 అడుగుల మేర పేరుకుపోయిన మట్టిని పంట భూముల్లో వేసుకోవాలి. దీనికి భూసార పరీక్షలు చేయించుకుని వాడుకుంటే ఇంకా మంచిది. జేసీబీలు, ట్రాక్టర్లతో తక్కువ ఖర్చుతో రైతులు మట్టిని తరలించుకునే అవకాశం ఉంటుంది. తర్వాత ఎంబీ నాగలితో పాటు రోటోవేటర్‌తో కలియదున్నితే భూమిలో అప్పటికే ఉన్న మట్టితో ఇది కలిసిపోయి పంట సాగుకు అనుకూలంగా మారుతుంది.

అధిక దిగుబడులకు అవకాశం



రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి. తమ పంట భూముల్లో సారాన్ని పెంచుకోవడానికి పెంటతో చెరువు మట్టిని వేసుకుని కలియదున్నితే ఎంతో మేలు. పంటలకు అవసరమైయ్యే పోషకాలు మెండుగా లభించి తద్వారా పంట ఏపుగా ఎదిగి అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

– సందీప్, మండల వ్యవసాయ అధికారి, పెద్దవూర